1516

# గెరిల్లా



1516

ఉప్పల లక్ష్మణరావు

కథా నిలయం
1576
శ్రీకాకుళం

"ఒసేవ్! దానికింకా జడే వెయ్యలేదుటే? మరో ఘడియకల్లాం వాళ్ళు కారులో రానే వస్తారాయే! ఒరే భాస్కరం, మీ ఆవిడెతో చెప్పి పెద్దపెట్టెలో అమ్మనాగరం, చామంతిపువ్వూ, రాగిడీ, పాపిటచేర్లు, వడ్డాణంతీసి వదినెకిమ్మను! అబ్బ, యెవ్వరికీ అఖ్ఖర్లేని బాధ నాకే పట్టుకుంది!" అని పెద్దన్నయ్య ఒహటే విసుక్కోవడం.

"ఎందుకండీ అలా హడావిడి పడిపోతారూ? మా పని మేం చూసుకుంటాం లెద్దురూ! మీరూ, మరిదిగారూ లోపలివసారాలో తివాసీలు వేయించి - ఫలహారాలూ, తాంబూలాల సంగతి చూసుకుందురూ!" అని పెద్దవదినె సమాధానం.

ఈ నాటకం నాకేం కొత్తకాదు. ఈ యేణ్ణర్థంలోనూ యిది. ఐదోసారి పెళ్ళిచూపులకి వొచ్చినవారిలో పెద్ద ముత్తైదువ నా మెళ్లో చెయ్యిపెట్టి చంద్రహారప్పేటలు లెక్కపెట్టడం, వాళ్ళతోవొచ్చిన మరో ఆవిడె నా జడ ఎంతపెద్దదో మూర వేసి కొలవడమూ, జడలో సవరం వుందేమో అనే అనుమానం తీర్చుకుందుకు జడపాయల్లో వేలుపెట్టి కెలకడమూ, వాళ్ళల్లో పెద్దగరి మీసాలాయన, నేను మూగదానని కాననీ, నాకు నత్తి లేదనీ ప్రత్యక్షంగా స్థిరపరచుకుందుకు, 'మీ అమ్మాయికి సంగీతం వస్తే ఓ క్రుతి పాడించండి!' అని ఆజ్ఞాపించడమూ, నా కుంటికాలునీ, తొంటిచెయ్యినీ దాచిపెడుతున్నానేమో అని:

మీ 'అమ్మాయికి భరతనాట్యం నేర్పించారండీ?' అని మరో ఆయన అడిగి, వెంటనే: 'ఏ గురువుగారి దగ్గరండీ?' అని భోగట్టా చెయ్యడమూ, చిట్టచివరి ప్రశ్నగా: అమ్మాయిని ఆ గోడదగ్గర వొఖసారి నిలబెట్టిస్తారా? మీ కభ్యంతరం లేదనుకుంటాను. అమ్మాయేమాత్రం పొడుగో వొఖమాటు చూసుకుంటే మంచిది కదా! అని ఇంకో పెద్దమనిషి హుకుం జారీ చెయ్యడమూ ఈ పరీక్ష తతంగమూ, యీ ప్రశ్నల పరంపరా నాకు కంఠోపాఠమే. మా అన్నయ్యలు నన్ను బాగానే చూస్తున్నారు కానీ వాళ్ళకి నేనో బరువుగా తయారయాననీ, ఆ బరువు యెంత త్వరగా నెత్తిమీద నుంచి దింపుకుందామా అని వాళ్ళకుందనీ నేనెరుగుదును. మావదినెలకి మొగపిల్లలూ, ఆడపిల్లలూ వున్నా, నేనంటే వాళ్ళిద్దరికీ మహాముద్దు. నేను వాళ్ళ అడ్డాళ్ళలోనే పెరిగాను. వాళ్ళచేతుల్లోనే పెరిగి పెద్దదాన్నయ్యాను. అమ్మలేని కొరత వాళ్లుతీర్చేశారు. మా అన్నయ్యలకి పిత్రార్జితం రెండొందల యెకరాల సుక్షేత్రమూ, 'ఘడీ' అంతలోగిలి వుండడం చేత నైజాంలో అందరి భూస్వాములాగానే వీళ్ళు పిల్లదేశముఖులూ, దేశపాండ్యాల్లా జీవితాలు వెలగబెడుతున్నారు.

చిన్న వదినె నా తల్లో నాగరం కింద చామంతి పువ్వు పెడుతూంటే, నాకనిపించింది: నేనే ఆ మగచిన్నవాణ్ణి ప్రశ్న వేస్తేనో?— "మీకు సంగీతం వొచ్చా? నాకు క్షేత్రయ్య పదా

లంటే మహాయిష్టం. 'అక్కరో! మగవాని కెక్కడి వలపులే' అన్న కాంభోజిరాగం పదం పాడగలరా? నేను ఐదడుగుల మూడంగుళాల పొడవు. మీ పొడవెంత? మీ కవతగాడు సాయంత్రాని కల్లా రెండుముంతల కల్లుతెచ్చి వంటింటి వసారాలో వుంచుతాడా? మా ఘడీలోలా, మీ ఘడీలోనూ వెట్టి చేసే దాసీలు మిమ్మల్ని చూసి భయపడతారా?" అని. కాని ఈ మాటు నాబతుకు ఓ కొత్తమలుపు తిరుగుతుందని తోచి ప్రశ్నవేయడానికి నోరు పెగల్లేదు.

* * *

మా బుల్లాడి కిప్పుడు రెండేళ్ళు. వాణ్ణి చూసుకోవడంతోనే నాకిప్పుడు సరిపోతూంది. మా జీవితం పూర్తిగా మారిపోయింది. పెళ్ళిచూపులనాడు ఆయన చూపులూ, నాచూపులూ కలిసినప్పుడు - ఆ కళ్ళలో నన్ను అమాంతం మింగేయాలనే దాహపు చూపులూ, ఆ చూపులతోనే నన్ను వివస్త్రచేసి నా కన్నెరికం హరించేద్దాం అనే వలపు కామనా, అసలు అవుపడలేదు సరికదా, వాటి బదులు, ఆ నల్లని కనుపాపలు చల్లని వెన్నెల వెలుగులు చిమ్ముతున్నాయి. అవి అనుకూలుడైన నాయకుడి ద్రుక్కులని తెలుసుకుని వాటిని గుండెలో భద్రంగా దాచుకున్నాను. ఆ నాటి చూపుల చలప జీవితాంతం అనుభవించాలని మనసారా కోరుకున్నాను.

మేఁవిప్పుడు తెలంగాణంలో అశ్వారావుపేట పరగణాలో రేకపల్లి గ్రామంలో వుంటున్నాం. ఆనాడు పెళ్ళిచూపుల కొచ్చినప్పుడన్నారు వారు మా అన్నయ్యలతో-కాస్త బిగ్గర గానే - నేను వినాలనే అనుకుంటాను: "మా పరగణాలో నాకో మూడొందల యకరం ఉందనుకోండి. ఐనా - ఏఁవి శాశ్వతఁవండీ! తెలంగాణం అంతా ఆంధ్రమహాసభవారి ఉద్యమంతో అట్టుడికి పోతూంది కదా! రైతులు ఏనాడేనా వాళ్ళ భూఁవులు వాళ్లు లాక్కోక మానరండీ" అన్నారు. మా దూరపు బంధువు ఒకాయన అన్నాడు: "అదేఁవిటండీ సుబ్బయ్యగారూ! మన భూఁవులు లాక్కునే మొనగాడెవడో నా దగ్గరకి రమ్మనండి. గుండేసి కాల్చేయకపోతే నాపేరు చంద్రశేఖరయ్య కాదనుకోండి. నైజాం వున్నంతకాలం మనకేఢోకా వుండదనుకోండి!" అని వో వంకర నవ్వు నవ్వాడు.

తన భూఁవుల్ని పేద రైతాంగానికీ, రైతు కూలీలకీ పంచిపెట్టేయాలని తనకి వుందనీ, నా పేర వందెకరాలు రాసి అట్టేపెట్టేయ్యాలనుందనీ, నా సలహా ఏఁవిటనీ ఆయన నన్నడిగారు. నా పేర సెంటు భూఁవి కూడా రాయొద్దనీ, మూడొందల యెకరాలూ రైతాంగం స్వాధీనంచేసి, దస్తావేజులు రాసి యిచ్చేయాల్సిందనీ నేనన్నాను. అందుకాయన మొహం యెంత ప్రఫుల్లఁవైందో నేను చెప్పలేను. నేను మరోటి కూడా అన్నాను: "మనకున్న మరో యాభై యకర

రాల మాగాణికి మాత్రం బుల్లాడు వారసుడయ్యేట్టు కాగితం రాయండనీ, వాడికి గ్యానం వచ్చాక ఆ భూమిని వాడు రైతులకు దానంచేసినా, చెయ్యకపోయినా వాడిష్టం." అని. ఆయన నా సలహా ప్రకారమే కాయితాలు రాసేసారు. ఆయనేనాడో 'సంగం'లోనూ (ఆంధ్రమహాసభ); 'పార్టీ'లోనూ చేరారు. మావారు ఇలా భూములు రైతాంగానికి స్వాధీనంచేసేయడంతో ఆ చుట్టుపక్కల పదిపదిహేను గ్రామాల్లోనూ చిచ్చురేగింది. కమతగాళ్ళూ, పేదరైతులూ, రైతు కూలీలూ-ఆడా మొగా-ఖావందుల మీద తిరగబడి ఘడీల్లో జొరబడి తుపాకులూ, బందూకులూ లాక్కుని, పశువుల్ని తోలేసుకుని, పొలాలు ఆక్రమించుకుని, సాగులు మొదలెట్టి భూదాహం తీర్చుకున్నారు. ఘడీలు నేలమట్టం అయాయి. వెట్టిచాకిరీ చేసి జీవచ్ఛవాల్లా బతుకులీడుస్తూన్న పేదరైతాంగపు కోపజ్వాలకి నిలవలేక ఖావందులు ప్రాణాలు దక్కించుకుని పట్నాలకి పారిపోయారు. మా అన్నలు ఉదారస్వభావులవడంచేత తమ భూముల్లో కొంత భాగాన్ని రైతాంగానికి స్వాధీనంచేసేశారు అందుచేత మా గ్రామంలో వాతావరణం ప్రశాంతంగానే వుంది. ఇతర భూస్వాముల భూములను రైతాంగానికి స్వాధీనం చెయ్యనూలేదూ, గ్రామాలలో వుండేందుకు ధైర్యమూ లేదు. వారు నగానట్రా. సరకూ జప్రా, జవాహిరీ నగదూ మూటగట్టుకొని దగ్గరపట్నాలకు రహస్యంగా పారిపోయారు.

మాపది పదిహేను గ్రామాల రైతాంగాన్ని హడలుగొట్టి, భీభత్సకాండ జరిపించి రైతులు భూఁవులు వదులుకునేలా చెయ్యాలనీ నైజాం పోలీసులూ, కాసిం రజ్వీ రజాకార్లూ, పటేల్ పట్వారీల ముష్కరులూ, భూస్వాఁవుల గుండాలూ దోపిడీలూ, మానభంగాలూ, చిత్రహింసలూ, కొంపలు తగల బెట్టడాలూ - ఎన్ని చెయ్యాలో అన్నీచేయడానికే యెన్నెన్నో ప్రయత్నాలు చేశారు. చేసినా, గ్రామాల్లో రైతుయువకులు సాయుధ జట్లుగా యేర్పడి గ్రామాలచుట్టూ పహరాలూ, గస్తీలూ యేర్పాటుచేసి, వాళ్ళలో చురుకైన యువకుల్నీ, యువతుల్నీ, కొరియరులుగానూ, వేగులవాళ్ళగానూ నియ మించి, నైజాం పాలననీ, భూస్వామ్య వ్యవస్థనీ కూలదోయ డానికని సాయుధ తిరుగుబాటు ధ్వజం లేవనెత్తి - అడవుల్లో పోరాటం సాగిస్తున్న 'సంగం', పార్టీ దళాలతో సన్నిహిత సంబంధాలు పెట్టుకున్నారు. మా ఘడీలో తెలుగు పిల్లలకి పాఠశాల పెట్టించారు. పంచాయతీ పరిపాలన నెలకొల్పారు. ఆ చుట్టుపక్కల గ్రామాల్లో యే పెద్దితగాయిదాలూ, కుటుంబ కలహాలూ, మగనాలి తగవులూ వొచ్చినా పంచాయతీ కోర్టు తీర్పు నిరాటంకంగా అమలు జరిగేది.

భూస్వాఁవులు వూరుకోలేదు. పోలీసు బలంతోనూ, రజాకార్ల గుండాగిరితోనూ, 'సంగాన్నీ', పార్టీనీ సర్వనాశనం చేసేస్తాఁ వనీ పుకార్లు పుట్టించారు. అందుకు తగినట్టు మా గ్రామానికి

పాతికమైళ్ళ దూరాన దస్తగిరి బంజర్లో పోలీసు కాంపు పెట్టించారు. అమానుషమైన హింసాకాండ నిత్యకృత్యమై పోయింది. ప్రత్యేకం ఈ పోలీసు కాంపు దుండగాలని అరికట్టడానికని, జిల్లా 'సంగం', జిల్లా పార్టీ అనుమతితోనూ, వాళ్ళ పర్యవేక్షణ కింద మావారి నాయకత్వాన గస్తీ, పహరాకాసే యువకుల్లో మెరికలు పాతికమందిని సాయుధదళంగాచేసి, వారికి ఓ వారం రోజులపాటు గెరిల్లా పోరాటంలో శిక్షణ ఇచ్చారు. ఎనిమిదో రోజు రాత్రి హుటాహుటిని పోలీసు కాంపుకి మైలుదూరం ఎగువనున్న రాయప్రోలు గుట్టల్లోశిబిరం ఏర్పాటుచేసుకున్నారు. ఆనాడు రాత్రి ఆయన యింటినుంచి వెళ్ళిపోయేముందు, మంచంమీద నిద్రపోతూన్న బుల్లాణ్ణిముద్దు పెట్టుకుని నన్ను పిలిచి: "పార్వతీ! మళ్ళీ యింటికెప్పు డొస్తానో యీ మాట నిశ్చయంగా చెప్పలేను. ఇన్నాళ్లూ మనది దెబ్బకాచుకోవడమే అయింది. ఈ మాటు దెబ్బకాచు కోవడం వాళ్ళవంతు. దెబ్బతీయడం మనవంతు. ఎదురుదాడి మన కొత్త యెత్తుగడ - యెదురుదాడే కాదు, మెరపుదాడి కూడాను. అందులో యేమేనా జరగొచ్చు. నన్ను వెళ్ళి రమ్మంటావా?" అన్నారు.

"అలా అనకండి! నేనా మాటలు వినలేను!" అంటూ వారి గుండెలమీద వాలిపోయాను. పొంగి పొరలొస్తూన్న దుఃఖంతో గజగజ వణికిపోతూన్న నన్ను ఆయన సంబాళించి,

నాకళ్లు తుడిచి, నా జుట్టు సవరించి, నుదుట రేగిన కుంకం సరిదిద్ది, చల్లని చూపులు నా మీద ప్రసరించి, నాకళ్ళూ, చెక్కిళ్ళూ, పెదవులూ గోముగా ముద్దుపెట్టుకుని:

"నీ జీవితం కఠినంగా వుంటుంది - ముందుముందు యెంతటి తీవ్రమైన మలుపులు తిరుగుతుందో కూడాను! పార్వతీ! నువ్వు మనసు గట్టిచేసుకోవాలి. యేదియేమైనా మన పార్టీ ప్రతిష్ఠని నిలబెట్టాలి సుమా! బుల్లాణ్ణి జాగ్రత్తగా చూసుకో!" అంటూ చీకట్లోకి మాయమైపోయారు. తెల్లవారే సరికి గ్రామంలో వాతావరణం బిగుసుకుపోయి, సాగతీసిన వీణ తీగెలా రవంత తాకితే చాలు మొర్రో అని మోగేట్టుంది. అందరి గుండెల్లోనూ కారుమబ్బులు అలముకున్నా, కళ్లు ఉద్రేకపు జీరలతో యెరుపెక్కినా యెవ్వరూ యే మాత్రం తొణకడం లేదు. మూడు రోజులు గడిచాయి. నాల్గో రోజున యింకా వేకువ చిరుచీకట్లు తెరలు విడకముందే యెవరో తలుపుతట్టిన చప్పుడు.

"టక్-టక్-టక్-టక్-టక్!"

అవును, అది చాకలి అయిలమ్మ సౌంజ్ఞ. అయిలమ్మ కుల వృత్తి చేసుకుంటూనే శక్తియుక్తులతో వేగుపని చేస్తూంది. ఏదో ప్రమాదం జరిగినట్టుంది. లేకుంటే తెల్లారకుండారాదు. ఓవేళ యెదురుదాడిలో వారికి - దళానికీ....? తలుపుతీసి:

"అయిలమ్మా! ఏదేనా ఖబురందిందా? మన వాళ్ళందరూ ..?"
అయిలమ్మ ఓ అడుగేసి నా పక్కనించుంది.

"ఏం సెప్పనమ్మా? నోరాడకుంటంది. ఆయనగోరూ....... యెంకట్రాయుడి కొడుకు యీరయ్యా-తిరిగి రానేదంట. పోలీసు యదవలు ఆర్గురుసచ్చింర్డంట-కోరియరుసెప్పిండు" అంది.

నాకు మొహం ఝుమాలు మంది. కింద కుప్పకూలిపోయాను. అయిలమ్మ వుంచి గాఖట్టి, దగ్గరున్న మంచంమీద పడుకో బెట్టింది నన్ను పక్కనున్న చిన్న మంచంమీద బుల్లాడు పడుకున్నాడు. లాంతరు వెలుగులో కనిపించింది-వాడి మీది పెదవి చిన్నగా కదల్తూంది-చిన్న నవ్వు మొగ్గ విడుతూంది వారి చివరి మాటలు గుర్తుకొచ్చాయి.

"పార్వతీ....నువ్వు మనసు గట్టిచేసుకోవాలి.........జీవితం యెన్ని మలుపులు తిరిగినా పార్టీ ప్రతిష్ఠ నిలబెట్టాలి సుమా'" ఈ ఆరేళ్ళ బతుకూ నా కళ్ళముందు పరిగెత్తింది. అన్న య్యలు, వదినెలు.... పెళ్లి చూపులు... చల్లని వెన్నెల విరులు ....చలవ పలుకులు.... వేడికావలింపు....బుల్లాడు.... వారు నేంకొరిగారు....ఎందరో వీరులు నేల రాలారు.........ఎంద రెందరో నైజాం కిరాతకానికి బలైపోయారు....వీడు.... మాబుల్లాడు....తెలంగాణంలో వున్న బుల్లాళ్ళు....పాపలు....

యెవ్వరూ బలికాకూడదు!........యెద పలుకుతూన్న యీ మాటలతో నాకు సత్తువొచ్చింది. లేచి పెరట్లోకెళ్ళి మొహం కడుక్కుని ఇంట్లోకొచ్చా.

"నెగిశావా తల్లీ! అట్టుండాల! 'నీ కాలికి మొక్కుతాదొరా, నీ బానిసోణ్ణి' అని నామొగాడు అనలేదనీ, యెట్టిశాకిరీ శేయనన్నాడనీ దొర ఆణ్ణి ముక్క ముక్కలు గోసేసి మాగుమ్మం కాడ పారేసిండు. నాను కళ్లారా సూసినా. వొఖ్ఖ కన్నీటిబొట్టు నాను కార్చనేదు. ఆనాడు ఒట్టేసుకున్నా: యీ దొర్ల నెత్తురు....నా కుంకుం సెరిపేసిన యీ దొర్ల నెత్తురు బొట్టెట్టుకోకుండా నే సావనని. అయ్యాపోయిండు. గింకెంతమంది పోవాలో....ఎంతపోరాటం సెయ్యాలో....నా తల్లీ!....ఇది గిదిగో యీ యేడేడి జొన్న సంగటితాగమ్మా....రవంత వొర్ర, ఉప్పుగల్లా యేసుండా....ముందుకుందమ్మా సానా పోరు." అంది ఆవె.

నేను నాలుగు గుటకలు మింగింతర్వాత అయిలమ్మ అంది: "అమ్మగోరూ! యెంకట్రాయుడు తాతని సూసొత్తవా? ముసలాడు బేజారెత్తిపోతుండు. నిన్ను సూత్తే కాసింత కుదుట పడతండేవో?...."

* * *

"పార్వతీ! నువ్వు గుండె గట్టిచేసుకోవాలి ...పార్టీ ప్రతిష్ఠ నిలబెట్టాలి సుమా!"— అవును....పార్టీ ప్రతిష్ఠ నిలబెడ

తాను. గుండె రాయి చేసుకున్నాను. కామ్రేడ్లు రామలమ్మ, రంగమ్మ, సావిత్రమ్మ, నరసమ్మ - ఎందరో పోరాటంలో చేరారు. నేనూ చేరతాను. మా బుల్లాడి మాటేవిఁటి? వాణ్ణెవరు సాకుతారు? ఎవరికేనా యిచ్చి, చూడమంటేనో నే మళ్ళీ యింటికొచ్చేదాకా? రావఁడవంటూ వుంటుందా? వారు మళ్ళీ యింటికొచ్చేరా?........ వెంకట్రాయుడి కొడుకు యింటి కొచ్చాడా? అబ్బా ! నేను బుల్లాణ్ణొదల్లేను బుల్లాణ్ణి చంక బెట్టుకు నా బతుకులో మళ్ళీ యీ సరికొత్తమలుపు తిరగ్గ లనా? నైజాంతో పోరాటం సాఫీగానే సాగుతూంది. నా బతుకే సాఫీగా సాగడంలేదు.... ఐనా ఈమలుపు నే తిరగాలి తిరిగి తీర్తాను! బుల్లాణ్ణి తీసుకుని అయిలమ్మ సాయంతో గుంట్రాతిమడుగు రెండు మజిలీలుచేసి చేరుకున్నాను. అక్కడ అయిలమ్మ నన్నూ బుల్లోడిని ఆ ప్రాంతం కోరియరు-పడిగ పాటి నాగక్కకి అప్పజెప్పింది కోయనాగక్క బుల్లాణ్ణి వీపుక్కట్టేసుకుని, నాచెయ్యి పట్టుకుని రాత్రి చీకట్లో ఆ తుప్పలు దాటించీ, గుట్టలు యెక్కించీ తీసుకెళ్ళింది. నైజాం పోలీసుల ఘోరాల గురించీ, భూస్వాఁవుల దౌర్జన్యాలగురించీ. దళాల సాహసాల గురించీ, ఎన్నో కథలుచెప్పింది. మ్రరెండు రాత్రులు నడిచి యీ శిబిరం చేరుకున్నా.

....అప్పుడే ఐదునెల్లైంది. బందూకులూ, తుపాకులూ, పోలీసు రైఫిళ్ళు గురిచూసి పేల్చడం నేర్చుకున్నా. మూడోం

దల గజాల్లో వెదురుకి గుచ్చిన నేరేడుపండుని తుపాకీ గుండేసి యెగరగొట్టడం నేర్చుకున్నా. రైఫిళ్ళని యెక్కడి కక్కడ విప్పదీసి, శుభ్రంచేసి, నూనె చుక్కపోసి, క్షణంలో మళ్లీ అమర్చి తూటాలు బారుచేసి సిద్ధంచేయడం నేర్చుకున్నా. మందుగుండు సామాన్లు పాళాలుగా కలిపి చేతి బాంబులు తయారీ నేర్చుకున్నా. సీసం కరిగించి గుళ్లు పోత పోయడం నేర్చుకున్నా. మరి వారంరోజుల్లో దళనాయకుడు కామ్రేడ్ కాటయ్య నన్ను గెరిల్లాదాడికి పంపుతానన్నాడు కూడానూ!

మొన్న వరంగల్లు నుంచి పార్టీ ఉన్నత అంతస్తు పెద్దలు శిబిరం చూడ్డానికొచ్చారు. అమరవీరుడు కామ్రేడ్ సుబ్బయ్య భార్యనని నన్ను అభినందించారు. నా పట్టుదల ప్రశంసిం చారు. తుపాకీ పేల్చడంలో నా నేర్పుని మెచ్చుకున్నారు. అప్పుడు పార్టీ సభ్యత్వానికీ నా దరఖాస్తు వారికి అందజేసాను. కామ్రేడ్ రెడ్డి నా దరఖాస్తు పుచ్చుకుని :

"మిమ్మల్ని రేపోమాపో దాడికి పంపించాలనుకుంటున్నట్టు కామ్రేడ్ జగన్నాథం చెప్పాడు. మంచిది. మరైతే మీబుల్లాడి మాటేమిటి? మీకేదైనా అయితే మీ బుల్లాడి బాధ్యత పార్టీ తన నెత్తిని పెట్టుకునే స్థితిలోలేదు. అందుకు మార్గం ఆలో చించారా కామ్రేడ్ పార్వతీ?" అని అడిగారు.

ఆ ప్రశ్న నా చెవిని బడేసరికి నామీది ప్రాణాలు మీదికెగిరి పోయాయి నాలిక అంగుడికి అంటుకు పోయింది. ఆ ప్రశ్న నేనెప్పుడూ వేసుకోలేదు. ఆ ప్రశ్న లీలగాతోచినా దాన్ని బుర్రలోంచి తరఁవేసేదాన్ని. ఆ ప్రశ్నకి నా దగ్గర జవాబు లేదు. నా ముఖ కవళికలు గమనించి కామ్రేడ్ రెడ్డి అన్నారు: "బుల్లాణ్ణిక్కడొదిలిపెట్టి మీరు ఎదురు దాడికెళితే-మీధ్యానం అంతా వాడిమీదే వుంటుంది. బుల్లాడు శిబిరంలోవుంటే శిబిరం క్రమశిక్షణకి భంగం కలుగుతుంది. గెరిల్లా జీవితంలో బుల్లాడికి చోటులేదని మీరు ఈ పాటికి గ్రహించేవుండాలి. వాణ్ణి మీరు వదిలిపెట్టేయాలి, కామ్రేడ్ పార్వతీ!"

"అంత మాటనకండి కామ్రేడ్!" అని అరచాన్నేను.

"అవునూ. నాకూ తెలుసు. బుల్లాణ్ణి చూస్తూంటే మీ ఆయన గ్యాఁపకంవొచ్చి మీ పట్టుదలకి మరింత బలం కలుగుతుందం టారు మీరు. నిజఁవే, కామ్రేడ్ పార్వతీ, నేనొప్పుకుంటాను. కాని గెరిల్లా కఠోర జీవిత నియమాలకది కుదరదు. పార్టీ నియమాలకి మనం కట్టుబడి వుండాలి. వ్యక్తిగతమైన బంధనాలు తెంపుకోవాలి! పార్టీ అప్పుడే అంతా ఆలోచిం చింది. రేపు ఉదయఁవే బుల్లాణ్ణి తీసుకుని మీరు బయలుదేరి, మీ అన్నగార్ల యింటికి వెళ్ళండి. మీ చిన్న వదినెగారి మేనత్తకొడుక్కి సంతతిలేదు. అతడు ఒక్క రైతు, అతడికి

మీ బుల్లాణి దత్తత యిచ్చేయండి. యాభై యకరాల మాగా ణికి బుల్లాడే వారసుడని కామ్రేడ్ సుబ్బయ్య రాసిన కాగితం పట్టికెళ్ళండి. మీరింకా మీ ఘడీలోనే వుంటున్నారనుకుంటు న్నారు మీ అన్నగార్లు. మీరు అలానే చెప్పండి. ఇక్కడి విషయాలన్నీ రహస్యంగా వుంచండి సుమీ! మీరు గెరిల్లా అని మరచిపోకండి! పెంపకం ఇవ్వడం అయాక వెంటనే బయల్దేరి వచ్చేయండి" అన్నారు కామ్రేడ్ రెడ్డి.

* * *

బుల్లాణ్ణి పరాయివాళ్ళ చేతుల్లో నా చేతులారా పెట్టి వచ్చేశాను. వాణ్ణి వదలి రావడం రొమ్ముచీల్చి గుండెకాయ తీసిచ్చేసినట్టే అనిపించింది. అన్నయ్యలు నన్నాదరించారు. కానీ దత్తత వాళ్ళ కిష్టంలేకపోయింది. ఏభై యకరాలు నేను వదులు కోవడం వాళ్ళకి పీకలుత్తరించినట్టుంది. నైజాం భూముులతో పాటు ఈ ఏభై యకరాలనీ మేమే అజమాయిషీ చేసుండే వాళ్ళమే అన్నారు. వదినెలు నన్ను కావలించుకుని యేడ్చారు. బుల్లాణి ముద్దుల్లో ముంచేశారు. వాణ్ణి దత్తత చేసుకుంటూన్న దంపతులు మా అన్నగారింట్లోనే దిగారు. దత్తత స్వీకారం ఖర్చులకి నా చేతి రెండుజతల బంగారపు గాజులూ అన్న య్యల కిచ్చేశాను. నా శతమానాలు అమ్మేసి బుల్లాడికిబట్టలు కుట్టించమన్నాను. బుల్లాణ్ణి ఒక్కరైతులికి పెంపకమివ్వ డమే మంచిదనుకున్నాను. లేకుంటే వాడూ పిల్ల జాగిర్దారులా

తయారవుతాడు-అని ఏడుస్తూన్న మనసునిజోకొట్టాను. మా అన్నయ్యలు మరి రెండు పూటలుండమని బలవంతంచేశారు. కాని మా వారి వెన్నెల చూపుల స్మృతులూ, గెరిల్లా జీవిత కఠోర నిబంధనలూ నన్ను శిబిరానికి లాక్కుపోయాయి. ఈ గడ్డు దినాల్లో ఘడీలో వుంటేనేగానీ ఆ మాత్రమైనా నాకు దక్కకుండా పోతుందని సాకుచెప్పి అయిలమ్మని వెంటబెట్టు కుని బయల్దేరా. జంగారెడ్డిగూడెం దగ్గర అయిలమ్మ వుండి పోయి, నన్ను కోయపాపక్కకి అప్పజెప్పింది. కొండ దార్లంట నడిచి, అక్కడక్కడ యెదురుపడిన పార్టీ గస్తీ లతో, వేగులవాళ్ళతో, సంకేతపు మాటలుచెప్పి, మూడో రాత్రికి గమ్యం చేరుకున్నాం.

* * *

ఇది శిక్షణా కేంద్రం కాదు-గెరిల్లా కేంద్రం అని తెలిసింది. ....అప్పుడే కేంద్రంలో చేరి మూణ్ణెల్లయింది. నా కిచ్చినది మిలిటరీ రైఫిలు. 303-మార్క్ 1. పదిపౌన్ల బరువు నాలుగు వందల గజాల రేంజి. మామూలు సైటే. ఐదు తూటాల మేగజైను.

ఈ రైఫిలు పేల్చడంలో నా పాత మెలకువలన్నీ నా వేళ్ళ చివర్లకి మళ్ళీ వచ్చేశాయి. ఇప్పటికప్పుడే నాలుగుదాడుల్లో పాల్గొన్నాను. గెరిల్లా యుద్ధపు ఎత్తుగడలు పాటిస్తూ ఇంత వరకూ మా దళానికే నష్టమూ కలగకుండానే నాలుగు

దాడులూ జయప్రదంగా సాగించాం. నాలుగుదాడుల్లోనూ నా రైఫిలుకి ఆర్గురు నైజాం పోలీసులు బలి అయ్యారు. మా దళం అందరిలోనూ వెంకటమ్మ అందెవేసిన చెయ్యి. ఆమె తుపాకి ఏడుగురు పోలీసుల్నీ, నలుగురు రజాకార్లనీ పొట్ట బెట్టుకుంది. కామ్రేడ్ గరటయ్య బందూకు ఎనమండుగురు పోలీసుల్ని నేలకూల్చింది. కోయ లచ్చక్క తుపాకీ ఐదుగురు రజాకార్ల ప్రాణాలు తీసింది మా తుపాకీ గుళ్ళకి యెందరు రాక్షసులు అవిటి వాళ్ళయారో మాకు తెలీదు.

....నాలుగుమైళ్ళ దూరాన్నున్న నాగాయగూడెం కోయ రైతుల మీద పటేలు పట్వారీలు కసి తీర్చుకుందామని పది మంది రజాకార్లనీ, నలుగురు పోలీసుల్నీ పంపిస్తున్నారనీ, మొగాళ్ళు పొలాల్నుంచి యింటికి వచ్చేలోపునే తమ పైశాచి కాల్ని పూర్తిచేయడానికని సాయంకాలం నాలుగ్గంటలకే ఈ రోడ్డుమీదనుంచి వెళ్తారనీ మా వేగులవాళ్ళ దగ్గిర నుంచి ఖబురందింది. ఈ కిరాతకుల మీద దాడిచేసి వాళ్ళకి బుద్ధి చెప్పడానికి నిశ్చయించుకుని మా దళనాయకుడు మమ్మల్ని రెండు జట్లకింద విడతీసి, రోడ్డుకి చెరివేపునా బండరాళ్ళ మాటున పొంచి వుండాల్సిందనీ, కుడివెంపు జట్టు తొలుత కాల్పులు సాగించాల్సిందనీ, మరి ముఫ్పై సెకండ్లకి ఎడమవెంపు జట్టు కాల్పులు సాగించాల్సిందనీ ఉత్తర విచ్చాడు. ఆ చుట్టుపక్కల గెరిల్లా కార్యాలేవీ యింతవరకూ

జరగకపోవడాన్ని, మా తుపాకిగుళ్ళ చప్పుళ్ళకీ ఆ కిరాతక మూక బేజారెత్తిపోయి, పిక్కసత్తువ చూపించింది. వాళ్లట్టే దూరం పారిపోనవసరం లేకపోయింది. రజాకార్లు ఏడుగురు అక్కడికక్కడే రాలిపోయారు. పోలీసుల్లో మాత్రం - ఒహడు చచ్చిపడినా, కడ(వ ముగ్గురూ నిలదొక్కుకుని గుడ్డిగా మా మీద యిటూ, అటూ కాల్పులు సాగించారు. ఇద్దరికి నూకలు చెల్లిపోయాయి. బతికి బయటపడ్డ నలుగురూ వొచ్చిందారనే పారిపోయారు. మేం వెంటనే మాటుజాగాల నుంచి వచ్చేసి, చచ్చిన వాళ్ళ యూనిఫారాల్నీ, తుపాకుల్నీ, మందుగుండునీ, వాళ్ళ జేబుల్లో వున్న కాయితాల్నీ సంగ్ర హించేశాం. దురదృష్టవశాత్తూ నా పక్కనే తుపాకీ కాల్పులు కాలుస్తూన్న కామ్రేడ్ నాగన్న గుండెలోంచి తూటా దూసుకు పోయి నేలకొరిగాడు. కోయ బూదెమ్మ యెడ(వ పిక్కకి గుండె తగిలింది. నా కుడి బుజానికి బల(మైన గాయం తగి లింది. తూటా మాత్రం పూర్తిగా పైకొచ్చేసింది. కాని రక్త స్రావం హెచ్చుగా వుంది. మా కోయ కామ్రేడ్లు అప్పటి కప్పుడు యేవో ఆకులు యేరి తెచ్చికట్టుకట్టారు నెత్తురు కారడం తాత్కాలికంగా ఆగినట్టేవుంది. చనిపోయిన కామ్రేడ్ శవాన్ని ఓ కామ్రేడ్ బుజాన వేసుకున్నాడు. నేను వెంకటమ్మ సాయంతోనూ, బూదెమ్మ పాపక్క, లచ్చక్కల సాయం తోనూ - దళంలో వున్న సభ్యులం అందరం కలిసి శిబిరం

చేరుకున్నాం. లాభనష్టాలూ బేరీజువేసుకున్నాం. జమ: శత్రు రాక్షసులు తొమ్మండుగురు ఖలి; మూడు పోలీసు యూనిఫారాలు. మూడు 303 రైఫిళ్ళు, ఏడు తుపాకులు, అరవై రౌండ్ల కాట్రిడ్జిలు, నూటయాభై తుపాకి గుళ్ళు, మూడు డైరీలు, రెండు ఆర్డరు కాయితాలు. ఖర్చు: మాలో ఒహ కామ్రేడ్ మరణం, ఇద్దరు కామ్రేడ్లకి బలంవైన గాయాలు. ఇదీ యీ నాటి లెక్క. గెరిల్లాలకి ఆనందానికీ, దుఃఖానికీ తీరికుండదు. రాత్రయేది, పగలయ్యేది - మరుక్షణం చేయాల్సిన దానిగురించే ఆలోచన. కామ్రేడ్ నాగన్న అంత్యక్రియలు జరిగాయి. మా శిబిరం డాక్టర్ కామ్రేడు మా ఇద్దరి గాయాలకీ కట్టుకట్టారు. శిబిరం చిహ్నాలేవీ లేకుండాచేసేసి, ఆ రాత్రికి రాత్రే దిగువనున్న మరో శిబిరానికి వెళ్ళిపోయేం.

* * *

"నా 303 రైఫిల్ నా కిచ్చేయండి. ఇదిగో పేలుస్తున్నా చూడండి నా గురి!"

"చూశారా కామ్రేడ్! రికోయిల్‌కి మీ బుజం ఎలా అదిరిపోతుందో! అంతెందుకు మీ మొహంవే చెబుతూంది - మీరు ఒప్పుకోకపోయినా-మీకు సూది గుచ్చినట్లు బాధగావుందని!" అన్నాడు డాక్టర్ కామ్రేడు. "నాకు పోలీసు పిస్టలివ్వండి... నాటు బార్మారు యివ్వండి.... నన్ను మాత్రం దళంలో నుంచి పంపించేయకండి, కామ్రేడ్ డాక్టర్!"

ఎంత ప్రాధేయపడ్డా, ఎంత బతిమాలుకున్నా, ఎంత కాళ్లా వేళ్లాపడ్డా ఫలితం లేకపోయింది. ఆ గుండుదెబ్బ నా గెరిల్లా జీవితానికి స్వస్తి చెప్పించేసింది.

"గెరిల్లా యెప్పుడూ గెరిల్లావే! గెరిల్లా చేయాల్సింది తుపాకి బుజాన వేసుకోవడం వొక్కటే కాదు. ఇంతకంటే బాధ్యతున్న పని మరొకటి మీకప్పజెపుతుంది పార్టీ. పార్టీ అఙ్ఞాతంగా వుండాల్సిన రోజుల్లో పార్టీ కామ్రేడ్ల కార్యకలాపాలన్నీ గెరిల్లా కార్యకలాపాలే! పార్టీ కామ్రేడు ప్రతీ వొఖరూ గెరిల్లావే! రేపు ప్రయాణంకి సిద్ధం కండి, కామ్రేడ్ పార్వతీ!" అన్నాడు దళనాయకుడు.

...బతుకు బాటలో మళ్ళీ మరొక్కమలుపు.

* * *

"కాయితాలయిపోయేయి, కామ్రేడ్ ! తెప్పించండి"

"సిరా రోలరు తిరగడంలేదు. శుభ్రం చేయించండి కామ్రేడ్!"

"స్టెన్సిల్ కలం మొద్దుబారింది. నడవడంలేదు"

ఇదంతా అంటూన్నదీ, విసుక్కుంటూన్నదీ, చిందులుతొక్కుతున్నదీ గెరిల్లా కామ్రేడ్ పార్వతే - నేనే.

"ఇదిగో డాక్టరుగారూ, బేండేజీ, స్టెరిలైజ్డ్ గాజూ !"

"సిరెంజి సిద్ధంగా వుందండీ, తెమ్మంటారా?"

"రసికారుతూంది. డెట్టాల్తో కడిగేసి, ఆయింట్ మెంటురాసి, కట్టుకట్టేశానండీ, డాక్టరుగారూ!"

"బెంపలేచరు చూశా. తొంభైతొమ్మిది పాయింటు మూడు. బార్లీ నీళ్లు తాగమన్నాను. డ్రై ఫార్టిక్ మిక్శ్చరుఇమ్మంటారా?"

ఇదంతా అంటూన్నదీ, వినయ విధేయల్తో పని నేర్చుకుంటు న్నదీ, ప్రజాసేవంటే కొత్త అర్థం గ్రహిస్తున్నదీ నర్సు అచ్చమ్మే - కామ్రేడ్ పార్వతే. రెండు అవతారాలు- అది సాయంకాలం అవతారం, ఇది పగటి పూట వేషం.

పట్నంలో ఓమోటారు వర్కుషాపు వెనకాల షెడ్డులో పార్టీ రహస్యకేంద్రం. కేంద్రంలో ఐదుగురం. కామ్రేడ్ నారయ్య గుంటూరు మిషన్‌కాలేజీలో బి యే. పూర్తిచేసి పాసయ్యాడు. కొన్నాళ్ళు పార్టీ పత్రికలో పనిచేసాడు. నారయ్య కరప త్రాలు రాస్తాడు. కొన్ని నవ్విస్తాయి,కొన్ని ఉద్రేకంతో పొంగులువారుతాయి, కొన్ని ప్రజాకర్తవ్యం బోధిస్తాయి. అతను రాసే కరపత్రాలన్నీ గొప్ప ప్రచార సాధనాలు. కామ్రేడ్ కేశవులు స్టెన్సిల్ తీస్తాడు. నేను కరపత్రం పాఠం స్టెన్సిల్ కాయితం మీద రాస్తాను. కాయితాలు బొత్తులు పెట్టడం, సరిగ్గా అమర్చడం, పరికరాలు అన్నీ సరిగ్గా సప్లై అవు తున్నదీ లేనిదీ చూసుకొనే బాధ్యతా నాదే. నా చేతులెప్పుడూ శుభ్రంగా వుండాలి. కాయితాల మీద వేలిముద్రలు పడకుండా చూసుకోవాలి. కామ్రేడ్ నరసింహులు వూళ్ళోకెళ్ళి పార్టీ కేంద్రాని కెళ్ళి కొరియర్ పని చేస్తాడు. నాకు అన్ని

పనుల్లోనూ సాయం చేస్తుంటాడు. కామ్రేడ్ అంజయ్య షెడ్డు గుమ్మంలోనే ఏదో కారు బాగుచేస్తూన్నట్టు నటిస్తూ పహరా పనిచేస్తూంటాడు. పార్టీ కామ్రేడ్ ఒక డాక్టరుగారి క్లినిక్కులో అచ్చమ్మ పేరుతో నర్సింగు నేర్చుకుంటూ పగలంతా ఆస్పత్రిలోనే వుంటూంటాను. సాయంత్రం నాలుగు కొట్టే సరికల్లా బట్టలు మార్చేసుకుని దొడ్డి దారంట షెడ్డులోకెళ్తాను. దీపాలు పెట్టేముందే సైక్లోస్టయిలు పని పూర్తిచేసుకుని నేను క్లినిక్కుకి వచ్చేస్తా. డాక్టర్ కామ్రేడ్ యిచ్చే జీతంతో హోటలు నుంచి భోజనం తెప్పించుకుని తిని, క్లినిక్కులోనే పంచపాళీ గదిలో పడుకుంటా.

....మావారి చల్లని వెన్నెల చూపులు....బుల్లాడి నవ్వులూ.... వూసులూ....తుపాకీ పేలుళ్ళు....రోగుల మూల్గులు...కామ్రేడ్ నారయ్య కళ్ళలో వెలుగు మెరుపులు....కలలూ నిజాలూ మధ్య బతుకు. నాలుగు నలలైంది. నా మనసు మనసులో లేదు. అమావాస్య రాత్రి-పున్నమి చంద్రుని స్మృతులు.... మబ్బులు అలవుకున్న నడిరేయి చీకట్లో మెరుపుతీగెల వెలుగులు....ఏవి నన్నాకర్షిస్తున్నాయో, నా భావిజీవితానికి యేవి కరదీపికలో నాకు తెలియకుండా వుంది. నాగోడు యెవరికి అర్థమవుతుంది? యెవరితో చెప్పుకోను? యెవరు వింటారు? పార్టీ వింటుందా? పార్టీకి యెదవుందా? ఏమిటి నా గతి?....

1516



ఓనాడు ప్రసంగవశాత్తూ అన్నాడు కామ్రేడ్ నారయ్య. తను చదువు పూర్తికాగానే పార్టీలో చేరాననీ, తన మీద ఆశలు పెంచుకున్న తల్లితండ్రులు తను కమిస్టుమతం పుచ్చుకున్నందుకు బెంగపెట్టుకుని చచ్చిపోయారనీ, తను కొన్నాళ్ళు కామ్రేడ్ నర్రా ఆంజనేయులు దళంలో వుండి పోరాటంలో పాల్గొన్నాననీ, కుడికాలి చీలమండకి గుండు దెబ్బ తగలడంతో పార్టీ తన కీ పని ఒప్పగించిందనీ చెప్పాడు. నా వెనుకటి జీవితం గురించీ, నా గెరిల్లా అనుభవాల గురించీ నేనూ చెప్పాను. అతను బాగా చదువుకున్నవాడు, సంస్కార వంతుడు. ఇంగిత గ్యానం వున్నవాడు. రసికుడు. నాచేత ఎన్నో పుస్తకాలు చదివించాడు. విప్లవతత్వం విశ్లేషించి అరటిపండు వొలిచి చేతిలో పెట్టినట్టు బోధించాడు. కళకీ, సాహిత్యానికీ, సమాజానికీవున్న అవినాభావసంబంధం కరతలామలకంలా చూపెట్టాడు.

...యేడాది అవుతూంది. బతుకులో ఓ సగం - రహస్య జీవితం...సైక్లోస్టయిలు తీయడం.. తత్వం తెలుసుకోవడం... సామాజిక స్ప్రహ పెంచుకోవడం. ఓ సగం - నర్సింగుపని నేర్చుకోవడం...ప్రజల మనస్సు తెలుసుకోవడం...కష్టాలకి అలవాటుపడడం. రెండు సగాల నడుమ - కామ్రేడ్ నారయ్య స్నేహం. నానాటికి వొహరికొహరం సన్నిహితులం అవుతున్నాం. నేననుకుంటుంటాను:

"నాలో యేమిటీమార్పు? మా వారిని స్మరించుకోవడం మరచి

పోతున్నానా? బుల్లాడి కేరింతాలు అప్పుడే గ్యాపకం వొస్తూ, నాలో నిద్రాణంగా వున్న వాంఛలు మళ్ళీ తలెత్తుతున్నాయా? ఈ కోరికలు పొడసూపడం వారి స్మృతికి ద్రోహంవా? ఇలా యెన్నివేలసార్లు మధనపడ్డానో! మా చూపులు కలిసేవి. తల దించుకోవడం మరచిపోయేవాళ్ళం. మా ఇద్దరి మొహాల్లో చిరునవ్వు వెలిసేది. ఇష్టపూర్వకంగానో, యాద్రుచ్చికంగానో ఒహరి చేతివేళ్లు ఒహరికి తగిలేవి. ఆ స్పర్శకి నాలో, తేళ్లూ జెర్రులూ పాకాయని చెబితే అబద్ధంవే. వొళ్ళు పులకరించిందన్నా అది ఆత్మవంచనే. నరాల్లో విద్యుత్ ప్రవహించిందన్నా అసత్యంవే. ఎద ఆనందంతో పొంగి పొరలిందంటేనే నిజం. సంసార సౌఖ్యం నేను అనుభవించిందాన్నే. ఐనా కామ్రేడ్ నారయ్య వంక చూసినప్పుడు నా చూపుల్లో వలపు వుండే వుండాలి. మావారు నన్ను పారిజాతాల్లోపెట్టి పూజించారు. నేనూ వారిని త్రికరణశుద్ధిగా ఆరాధించాను. కానీ యెన్నాళ్లు ఓ నీడలో బతగ్గలను? అవును కామ్రేడ్ నారయ్య మీద నాకు వలపున్న మాట నిజం. నిజం ఒప్పుకుందుకు భయపడను. సిగ్గుపడను. వారు తన కడపటి వీడ్కోలు మాటగా పార్టీ ప్రతిష్ఠకి భంగంరాకుండా చూడమన్నారు. నేను పార్టీకి ద్రోహం చెయ్యడంలేదు...చెయ్యను....

పార్టీ ఉన్నత అంతస్తు కార్యకర్తలు రెండుమూడుసార్లు వచ్చినపుడు మా ప్రేమబంధాన్ని గ్రహించి, అందుకు అడ్డుచెప్పక

పోవడంవేకాకుండా, మా ప్రేమని ప్రోత్సహిస్తున్నారనికూడా అనిపించింది. ఓ సారి పార్టీ రహస్య సమావేశంలో మేం ఉండ గానే మా ప్రేమానుబంధం చర్చకొచ్చింది. సమావేశం మా అభిప్రాయం అడిగింది. పార్టీ అనుమతించిన పక్షంలో మేంవి ద్దరం పెళ్ళి చేసుకుంటావంనీ చెప్పాం. పార్టీ సమక్షంలోనే మేంవిద్దరం ఒహరంచేతిలో ఒహరు చెయ్యవేసి జంట జీవితానికి మాట యిప్పడం మూలంగా, పార్టీపట్ల అకుంఠిత భక్తి తత్పరతతో మా సంసారజీవితం గడుపుతాంవని ప్రతింగ్య తీసు కోవడం మూలంగా మేం దంపతులమంయ్యాం.

నా జీవితంలో సరికొత్తమలుపు. దేశచరిత్రలోనూ కొత్త మలుపు. నైజాంపై నెహ్రూ ప్రభుత్వం 'పోలీసుచర్య' మిలిటరీ చర్యగా పరిణమించింది. ప్రభుత్వం మిలిటరీని భూస్వాంవులమీదా, జాగిర్దారుల మీదా, ప్రజాద్రోహుల మీదా, రజాకార్ల మీదా ప్రయోగించలేదు. రైతాంగం మీదా,పార్టీమీదా ప్రయోగించింది. అక్కడ ఢిల్లీలో నెహ్రూ, పటేలు-ఇక్కడ జనరల్ చౌదరీ, తరువాత టి. సి. యస్. వెల్లోడీ, పార్టీనీ కూకటి వేళ్లతో సహా రూపుమాపుతాంవని ఒట్టు పెట్టుకున్నారు. మిలిటరీ సాగిస్తూన్న హింసాకాండ దుర్భరంగావుంది. దౌర్జన్యాలకీ, మానభంగాలకీ, గృహ దహనాలకీ అంతులేదు. తెలంగాణం అంతటా మిలిటరీ రాజ్యం స్వైరవిహారం చేస్తూంది. ప్రజలు భయభ్రాంతులై పోతున్నారు. రైతులు

ఆయుధాలుపయోగించి, తమ నెత్తురు చిందించి, స్వాధీనం చేసుకుని మూడేళ్ళుగా సాగుచేసి పంట అనుభవిస్తూన్న భూముల్ని మళ్ళీ ఆయుధాల్తోనూ, నెత్తురుతోనూ భూస్వాముల మిలిటరీ దమనకాండ నుండి కాపాడు కోవలసి వచ్చింది. తెలంగాణా పేదరైతాంగం సుశిక్షితమైన నైజాము సేనల ముందు నిలబడలేక పోతూంది. దమన నీతిదే పైచెయ్యి అవుతూంది. మిలిటరీ కిరాతకాలకి రైతులు హడలి పోతున్నారు. ధైర్య స్థైర్యాలు సడలిపోతున్నాయి.

"మీరిద్దరూ ఖమ్మం జిల్లా సిద్దేపల్లి వెళ్ళి అక్కడ పాలడుగు మల్లికాంబ యింట్లో రహస్యంగా వుంటూ రైతాంగంలో ప్రచారం చెయ్యండి" అని మమ్మల్ని పార్టీ ఆజ్ఞాపించింది. ఈ ప్రచారం యేటికి యెదురీతే అయింది. ఏనా పార్టీ ఉత్తరువు మీరకుండా పనిచేస్తూనేవున్నాం.

అది 1951 జనవరి, సాయుధ రైతు పోరాటం జీవన్మరణ సమస్యని యెదుర్కొంటూంది. నా గర్భంలో కొత్త జీవి రూపొందుతూంది. రైతు ఉద్యమంలో జీవం సన్నగిల్లుతూంది. భారత మిలటరీకి వ్యతిరేకంగా దళాలు విపరీతంగా నష్టపోతు న్నాయి. పాతవాళ్ళు నేలకొరిగిపోతుండగా, కొత్తవాళ్లు చేరడంలేదు సరికదా, వున్నవాళ్ళలో కొందరు దళాలు వదలి వెళ్లిపోతున్నారు. సాయుధపోరాటం నిలిపేస్తే తెలంగాణ రైతాంగానికి ద్రోహమే. రైతు ఉద్యమానికి వెన్నుపోటే.

మా యిద్దరి అభిప్రాయమూ అంతే. అగ్యాంతంగా నడుపు తూన్న శిబిరాలన్నిటినీ మూసేసి, అందరి కర్తవ్యాల్నీ సాయుధ దళాల్లోచేర్చి, అడవుల్లోకి పంపించి మిలిటరీకి వ్యతిరేకంగా గెరిల్లా పోరాటం సాగించాలని పార్టీ కఠోరనిర్ణయం తీసుకుంది.

పార్టీ కేంద్రకమిటీ కార్యకర్త కామ్రేడ్ శివరామయ్య మా కేంద్రానికొచ్చి పార్టీ నిర్ణయం మాకు తెలియజేశారు. కామ్రేడ్ నారయ్య పిండిప్రోలు గుట్టలకి వెళ్లాలన్నారు.

"నేను పాతగెరిల్లాని. నేనూ పోరాటంలో చేరుతాను. నన్ను దళంలోకి పంపించండి" అన్నాను కామ్రేడ్ శివరామయ్యతో. ఆయన నావేపుచూసి నవ్వుతూ: 'కామ్రేడ్ పార్వతీ! మిమ్మల్ని యెలాగూ పంపను సరికదా, కామ్రేడ్ నారయ్యనీ పంపనేమో?' అన్నారు.

"అదేమిటీ?" అన్నాను నేను కోపంగా.

"మీరు నిండు చూలాలన్నది నాకు తెలియంది కాదు. ఈ స్థితిలో మీరుండగా కామ్రేడ్ నారయ్యని అడవుల్లోకి ఎలా పంపిస్తాం?"

"అలా వీల్లేదు – యేమైనా వీల్లేదు!" అన్నాన్నేను మొండిగా

"ఐతే కామ్రేడ్ నారయ్యని పిండిప్రోలు గుట్టల్లోకి పంపించి తీరాలని మీరు పట్టుపడితే అందుకు పార్టీ షరతుల్ని మీరంగీకరిస్తే అలాగే చేస్తుంది పార్టీ" అన్నాడు కామ్రేడు.

"నేనా షరతుల్ని అంగీకరిస్తానని మాటిస్తున్నా" అన్నాను. అప్పుడాయన అన్నారు. "పార్టీ కేంద్ర కమిటీ మీ అన్న గార్లతో రాయబారాలు నడిపింది. ఈ స్థితిలో మీరుండగా మిమ్మల్ని వాళ్ళింటికి ససేమీ రానీయమన్నారు. అందుకని మీరు పట్నంవెళ్ళి మిషను ఆసుపత్రిలో పురుడు పోసుకోండి. మీ శిశువుని పిల్లల్లేని వాళ్ళెవరికయినా ఇచ్చేయండి. అప్పుడు మీ అన్నగార్ల దగ్గరకి వెళ్ళిపోండి. వాళ్ళు మిమ్మల్ని రాని స్తామని వాగ్దానం చేశారు. ఇలా మీరు ఒప్పుకుంటేనే కామ్రేడ్ నారయ్యని అడవుల్లోకి పంపిస్తాం. కామ్రేడ్ మనసు కుదుట బడుతుంది. పార్టీకి బరువు తగ్గుతుంది." అన్నారు కేంద్ర కమిటీ కార్యకర్త కామ్రేడ్ శివరామయ్య. ఆయన మాటలు ఆయన హృదయానికే పాషాణంలా తోచాయి. నావేపు చూడ లేక మోహం తిప్పేసుకున్నారు........ ఐదు నిముషాలపాటు ప్రపంచం అంతా శూన్యం అయిపోయింది. కాలం నిలిచి పోయింది. నా గుండెలో ప్రళయ భీభత్సం చెలరేగింది. కళ్ళు తెరిచిచూశాను. అందరూ ఆతురతగా ఆందోళనతో నాకేసి చూస్తున్నారు. కామ్రేడు నారయ్య నావేపు దీనంగా చూశాడు. నేను చిరునవ్వు నవ్వి ఆయన గుండెల మీద వాలిపోయాను. అందరూ వున్నారని నాకు తెలుసు. అందరూ కామ్రేడ్లే. మృత్యు దేవతతో రేపు భేటీకి వెళ్తున్నారని నేనెరుగుదును. నేను బిడియపడలేదు........

*  *  *

అంచీలమీద అయిలమ్మ, తదితర కొరియర్ల సహాయంతో నేను మా అన్నగార్ల గ్రామం చేరుకున్నాను. ఘడీలో కాలు పెట్టాను. మా అన్నయ్యలు ఆప్యాయంతోనే స్వాగతం పలికారు. కానీ వాళ్ళ మనస్సుల్లో ఏదో అనుమానం కలుగుతున్నట్లూ, కక్కలేక మింగలేక నాతో యేదో చెప్పడానికి ప్రయత్నిస్తున్నట్టూ నాకు తోచింది. నేనే అన్నాను "నేను రెండో వివాహం చేసుకోవడం మీకిష్టంలేనట్టుంది" అని. అందుమీదట వాళ్ళిలా అన్నారు: "మా కిష్టం లేకపోవడం కాదు. నువ్వు సుఖంగా వుండటమే మాకిష్టం. రెండో వివాహానికి మన సంఘం వప్పుకోదు. మన సంఘం ఆచారాలకూ, కట్టుబాట్లకూ అది వ్యతిరేకం. అందుకు మనం ఎదురీదలేం. అందులోనూ నువ్వు నిండుచూలాలివి. సంఘం అసలు వప్పుకోదు. మా సలహా ఏమిటంటే నువ్వు రహస్యంగా పట్నం చేరుకుని, అక్కడే పురుడుపోసుకుని - ఆ శిశువును ఎవరికేనా యిచ్చివేసి, రెండుమూడు రోజుల తర్వాత నువ్వు రహస్యంగా యిక్కడికి వచ్చేసెయ్యి. మా కెట్టి అభ్యంతరమూ లేదు. సంఘం కట్టుబాట్లకు భయపడి, తిరగబడ్డానికి ధైర్యంలేక నీతో యిలా చెప్పవలసివస్తోంది" వారి మాటలవల్ల నాపట్ల వారికి గల ప్రేమాభిమానాలు ఏ మాత్రం తగ్గిపోలేదని నాకు విశ్వాసం కలిగింది. అదీగాక పార్టీ సూచన కూడా యిదే నేను 'సరే' అని అయిలమ్మ సాయంతో ఆ మర్నాడు మిష

నాస్పత్రి చేరుకున్నాను.

*　　　　*　　　　*

జీవిత యాత్రలో ఇన్ని కొప్పుసూది మలుపులు తిరిగాల్సొస్తుందని యెన్నడూ అనుకోలేదు. ఆనాడు పెళ్ళిచూపులప్పుడు నేనే ప్రశ్నలడుగుదాఁవనుకున్నాను. ఇంత అగ్నిపరీక్ష నేనే యెదుర్కోవలసొస్తుందని యేనాడూ యెరగను. ఒహమాటు పెనిమిటిని కోల్పోయాను........బుల్లాణ్ణి పరాయివాళ్ళ వశం చేశాను....ఈనాడు ఈ పెనిమిటిని యుద్ధరంగంలోకి పంపించాను....రోజుల పిల్లాణ్ణి ముక్కూమొహం యెరగని వాళ్ళ చేతుల్లో పెట్టేశాను....నాకు మిగిలిందేఁవిటి?....నా ప్రాణఁవూ నా పార్టీ....

*　　　　*　　　　*

అన్నయ్యలింట్లో కాలుపెట్టాను. పచ్చిపురటాలనని వదినెలు నన్నెంతో ఆపేక్షతో చూసుకున్నారు. నాకేలోపం లేకుండా కడుపులో పెట్టుకుని కాపాడుతున్నారు అన్నయ్యలు.

పత్రికల్లో వార్తలొస్తున్నాయి. కఠోరఁవైన వార్తలు. ఏవి నిజమో, ఏవి నీలివార్తలో తెలియడం లేదు. తెలంగాణ వీర కిశోరాలు అనిరెడ్డి, రంగారెడ్డి, ఆల్వాల నర్సింహారెడ్డి, రంగాచార్యులు, శ్రీనివాసరావు, సోయం గంగులు నేలకొరిగారు. రాంబాయమ్మ లాఠీచార్జిలో నేలరాలింది. కామ్రేడ్ వెంకమ్మను మిలటరీవాళ్లు రాక్షసంగా చెరచగా, ఆఁవె ఆ క్రౌర్యానికి

ప్రాణాలు వదులుకుందు. పత్రిక పట్టుకున్నప్పుడల్లా నారయ్య పేరు యెక్కడ చదవాల్సి వస్తుందో అని హడలిపోయేదాన్ని.

*　　　*　　　*

"పార్వతీ నీ మనసు గట్టి చేసుకోవాలి!" అని వార గొంతు గుండెలో మారు మోగేది.

తెలంగాణా సాయుధ రైతుపోరాటం అంతమైంది. తెలంగాణా వీరులు సాయుధ పోరాటాన్ని విరమించారు. నెల్లాళ్ళ తరువాత మా వదినె లిద్దరూ నాకు తలంటిపోసి, కొత్త చీరె కట్టించి, నుదుట కుంకం బొట్టుపెట్టి నన్ను పార్టీ ఆఫీసుకి సాగనంపి, పంచలచాపూ, తాంబూలం కామ్రేడ్ నారయ్య చేతుల్లో పెట్టి నన్ను ఆయనకి ఒప్పగించారు.

నెహ్రూ ప్రభుత్వం ధర్మమా అంటూ చాలామంది భూస్వాములు భూముల్ని రైతాంగం చేతుల్లోంచి తిరిగి గుంజుకున్నారు.

*　　　*　　　*

పదేళ్ళ నుంచీ మేం పట్నంలోనే వుంటున్నాం. కామ్రేడ్ నారయ్య కార్మికుల యూనియన్‌లో కార్యకర్తగా పనిచేస్తున్నాడు. ఓ డాక్టరమ్మగారి ఆస్పత్రిలో నేను నర్సుగా వుంటున్నాను. బతుకు సాఫీగా సాగిపోతూంది. నాకప్పుడప్పుడూ బుల్లాడూ.... చంటాడూ.... కనబడుతుంటారు కలలో. బుల్లాడెక్కడున్నాడో నాకు తెలుసు. కాని వాళ్లు వాణ్ణి నా దగ్గరికి పంపరు. చంటాడికోసం యెక్కడని వెతకను? యేతల్లి చంక

బిడ్డని చూసినా నా చంటాడే అని భ్రమసిపోతాను....యే కోయస్త్రీ వీపున పిల్లాడు కనబడినా నా చంటాడేమో అని అనుమానపడతాను. ఆస్పత్రిలో యే పసిగుడ్డుని యెత్తుకున్నా నా చంటాణ్ణి యెత్తుకున్నాననే మురిసిపోతాను. ఏ ముష్టిదాని వొళ్ళో పసికందుని చూసినా నా చంటాడని ఉలిక్కి-పడతాను.

వాడిప్పుడు బతికుంటే పాతికేళ్ళ యువకుడైయ్యుంటాడన్న మాట మర్చిపోతాను....నక్సలైటై యే కొండల్లో తల దాచుకుంటున్నాడో?....పాకిస్తాన్ యుద్ధాల్లో నేరకొరిగాడేమో?....ఏ భిలాయ్‌లోనో, యే రాంచీలోనో ఇంజనీరేమో?....ఎదురుగా వున్న రిజిష్టరాఫీసులో కాపీయిస్టేమో? ఎక్కడని వెతకను?....రైఫిలు తూటాల వగరు వాసన జ్ఞప్తి కొచ్చేసరికి కళ్ళు చమర్చుతాయి....తుపాకి గుళ్ళ చప్పుళ్ళు గుర్తు కొచ్చినప్పుడల్లా ఎద స్పందన లయ తప్పుతుంది....

గెరిల్లా బతుకు ఇంకా ఎన్ని మలుపులు తిరగాలో?....
“పార్వతీ నీ మనసు గట్టిచేసుకోవాలి!”

★